

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 12 జూలై 2024







నిర్మలా జగ్గారెడ్డికి అభినందనల వెల్లువ

టీజీఐఐసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నిర్మలాజగ్గారెడ్డికి గురువారం పలువురు అభినందలు తెలిపారు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, రామచంద్రాపురం పట్టణ కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు.



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్

నిల్వ ఉంచిన 70 కిలోల మాంసం డంపింగ్ యార్డుకు..

మెదక్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు.. పలు హోటళ్లకు జరిమానా

మెదక్ మున్సిపాలిటీ, జూలై 11: మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకీరాంసాగర్ ఆదేశాలమేరకు గురువారం పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. రాయల్ మండి, అల్‌వహీద్, అరేబియన్ మండిలతో పాటు మరికొన్ని హోటళ్లను పరిశీలించారు. నిల్వ ఉంచిన 70 కిలోల మటన్, చికెన్‌ను గుర్తించి డంపింగ్ యార్డులో పారబోయించారు. నిల్వ ఉంచిన పదార్థాలు వినియోగిస్తున్న రాయల్ మండికి రూ.10వేలు, అరేబియన్ మండికి రూ.5వేలు, మరో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు రూ.2వేలు జరిమానా విధించారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానా విధించడంతోపాటు సీజ్ చేస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. తనిఖీల్లో సిబ్బంది శ్రీనివాస్, శేఖర్, శ్యాం, కిరణ్, కృష్ణ, కిషన్, సంజీవ్, లక్ష్మణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కిలేడీ.. మాయలాడి..!

వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాల పేరిట టోకరా

28 మంది నుంచి రూ. 2లక్షలు చొప్పున వసూలు

కలెక్టరేట్ అధికారుల పేరిట నకిలీ ఉత్తర్వులు

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటున్న బాధితులు

స్టాఫ్ నర్సు ఉద్యోగానికి రూ.3 లక్షలు.. ఏఎన్ఎం జాబ్‌కు రూ.2.50 లక్షలు.. క్లర్కు పోస్టు కావాలంటే రూ.2 లక్షలు.. ఇలా ఒక్కో ఉద్యోగానికి ధరను నిర్ణయించి అంగట్లో పెట్టింది ఓ కిలాడీ లేడీ. తనకు ఉన్నతాధికారులతో పరిచయాలున్నాయని.. వైద్యారోగ్యశాఖలో ఏ పోస్టునైనా ఇప్పించగలుగుతానని కొంతమంది మహిళలను నమ్మించింది. నమ్మిన అమాయకులైన మహిళలు అప్పుసొప్పు చేసి డబ్బులు తెచ్చిచ్చారు. అందినకాడికి దండుకుని ఫోర్జరీ సంతకాలతో నకిలీ జాబ్ ఆర్డర్లు చేతిలో పెట్టింది. ఆ తరువాత ఇదంతా మోసమని తెలియడంతో బాధితులు గొల్లుమంటున్నారు. న్యాయం చేయాలని అధికారులు, పోలీసులను కలిసి వేడుకున్నా స్పందించడం లేదని కన్నీటిపర్యంతమవుతున్నారు. తమకు జరిగిన అన్యాయం గురించి సంగారెడ్డికి వచ్చిన పలువురు మహిళలు 'ఆంధ్రజ్యోతి'తో మొరపెట్టుకున్నారు. వారు వెల్లడించిన విషయాలు అవాక్కయ్యేలా ఉన్నాయి. ఉద్యోగాల ఎంపికలో పారదర్శకత, ఆన్‌లైన్ విధానం ఉనప్పటికీ సదరు కి'లేడీ' వారిని మోసం చేసిన తీరు విస్మయాన్ని గొల్పుతోంది. అభ్యర్థులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి...

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 11



జహీరాబాద్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ వ్యవస్థలోని లోపాలను ఆసరాగా చేసుకొని ఉద్యోగాల పేరిట మోసానికి తెరతీసింది. నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం కింద సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో, వైద్యారోగ్య శాఖలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్న విషయాన్ని తెలుసుకుంది. తనకు తెలిసిన ఒకరిద్దరి వ్యక్తుల ద్వారా ఈ విషయాన్ని కొంతమంది ఆశావహుల్లో ప్రచారం చేసింది. డబ్బులు కడితే ఉద్యోగం పక్కాగా వస్తుందని నమ్మించింది. స్టాఫ్‌నర్సు, ఏఎన్ఎం, డాటా ఆపరేటర్లు, క్లర్కు, అటెండర్, వాచ్‌మన్ తదితర పోస్టులు ఉన్నాయని చెప్పి.. ఒక్కో ఉద్యోగానికి ఒక్కో రేటును నిర్ణయించింది. ముందుగా సగం డబ్బులు తీసుకొని.. నకిలీ ఆర్డర్లు చేతిలోపెట్టి మిగితాది గుంజింది. పోస్టింగ్ ఆర్డర్లు తీసుకొని ఆస్పత్రికి వెళ్లినవారు ఇవి నకిలీ ఉత్తర్వులని తెలుసుకుని అవాకయ్యారు. కిలాడీ మహిళ తమను మోసం చేసిందని తెలుసుకుని బావురుమన్నారు.

నకిలీ అధికారులచే కలెక్టరేట్‌లోనే ఉత్తర్వుల అందజేత..

బాధిత మహిళలకు ఎలాంటి అనుమానం రాకుండా సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోనే పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చేలా చేసింది సదరు కిలేడి. తాను స్వయంగా తయారుచేయించిన నకిలీ ఆర్డర్లను.. మరో ఇద్దరిని అధికారులుగా పరిచయం చేసి వారితో ఇప్పించింది. కలెక్టర్ లేదంటే డీఎంహెచ్‌వో చేతుల మీదుగా ఇప్పించాలని వారు కోరగా.. సమావేశాల్లో బిజీగా ఉన్నారని నమ్మించింది. ఏదైతేనేం చేతికి ఆర్డర్లయితే వచ్చాయనే సంతోషం ఎక్కువ సమయం నిలువలేదు. తాము మోసపోయామని తెలిసి సదరు మహిళను కలిసే ప్రయత్నం చేయగా ఆమె కనుమరుగైంది. ఆమె ఇచ్చిన ఫోన్‌నంబర్‌కు సంప్రదిస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. ఇంటికి వెళితే ఖాళీ చేసిపోయిందనే సమాధానం విని మరింత దిగాలు చెందారు.



సంగారెడ్డిలోని వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం


ఫిర్యాదులపై పట్టింపులేదు..

మహిళ చేసిన మోసంపై వైద్యారోగ్యశాఖ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని బాధిత మహిళ ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఎవరూ చర్యలు తీసుకోలేదని వాపోయారు. తనకు తెలిసినవారే 28 మంది మహిళలు మోసపోయారని, ఒక్కొక్కరి వద్ద లక్షల్లో సొమ్ము తీసుకుందని వాపోయారు. ఇలాంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోకుంటే ఎంతోమంది అమాయక మహిళలు అన్యాయానికి గురవుతారని మండిపడ్డారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఎవరిని అడిగి డబ్బులు ఇచ్చారని ఇష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేసింది.

ఉద్యోగాలిప్పిస్తామంటే నమ్మొద్దు

సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనే చెబితే నమ్మొద్దు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలైనా.. స్టాఫ్ నర్సు లేదా ఏ ఇతర ఉద్యోగాలకైనా కలెక్టర్ అనుమతితో భర్తీ కోసం ప్రకటన జారీ చేస్తాం. నిబంధనల ప్రకారం పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తాం. ప్రస్తుతం ఎటువంటి నోటిఫికేషన్ జారీ చేయలేదు. ఉద్యోగాల పేరిట మోసం జరిగినట్టు సోషల్ మీడియాలో ప్రచారంపై విచారణ పోలీసులు చేయాలి. ఈ మోసంలో ఆస్పత్రి ఉద్యోగులు, సిబ్బంది ప్రమేయమున్నా ఉపేక్షించేది లేదు.

-అనీల్‌కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్, సంగారెడ్డి



నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్



సంగారెడ్డిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

గంజాయి, డ్రగ్స్ రవాణాపై కొరడా

సంగారెడ్డి జిల్లాలో పోలీసుల నాకాబందీ

సంగారెడ్డి క్రైం, జూలై 11 : గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిర్మూలించడమే లక్ష్యంగా సంగారెడ్డి జిల్లా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా గురువారం తెల్లవారుజామున నాకాబందీ నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు తమ పరిధిలోని ప్రధాన రహదారుల్లో వాహనాలను తనిఖీ చేశారు. మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ చెన్నూరి రూపేష్ ఓ ప్రకటనలో తెలిపారు. గంజాయి సాగు, అక్రమ రవాణాపై 8712656777కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

వీధికుక్కల దాడులను అరికట్టండి

- జిల్లా కేంద్రంలో శానిటేషన్‌పై దృష్టిపెట్టండి
- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు



కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్, జూలై 11 : సంగారెడ్డి పట్టణంలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై కలెక్టర్ క్రాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. పట్టణంలో వీధికుక్కల స్వైరవిహారాన్ని అరికట్టాలని, కుక్కల దాడుల ఘటనలు పునరావృతమయితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కుక్కల సంఖ్య తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు, ప్రధాన కూడళ్లు, వార్డుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రతీరోజు ఉదయం వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. రోడ్లపై చెత్త వేసేవారిపై జరిమానా విధించాలని ఆదేశించారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్‌ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చవాన్ తదితరులు పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం అవుతున్నా చోద్యం చూస్తున్నారు

- మొక్కలు నాటేందుకు అటవీశాఖకు అనుమతి ఎలా ఇస్తారు?
- ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్లాట్ల బాధితులు


సమావేశమైన ప్లాట్ల బాధితులు

పటాన్‌చెరు, జూలై 11 : నాలుగు దశాబ్దాలుగా ఇళ్ల స్థలాల కోసం న్యాయపోరాటం చేస్తున్నా ఫలితం దక్కడం లేదని, తమ భూములు అన్యాక్రాంతం అవుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఇండస్ట్రియల్ కో-ఆపరేటివ్ సొసైటీ పేరుతో రియల్టర్ వద్ద ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం ప్లాట్ల యజమానులు బీరంగూడలోని లేఅవుట్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ పటాన్‌చెరు, బీరంగూడా, తెల్లాపూర్ గ్రామాల్లో 1980లో వేసిన లేఅవుట్లలో సుమారు 8500 మంది ప్లాట్లు కొనుగోలు చేశామని తెలిపారు. ప్రభుత్వ భూములను కలుపుకుని పట్టాభూములుగా చూపిస్తూ లేఅవుట్లు వేసి విక్రయించారని తేలడంతో వివాదం రాజుకుందన్నారు. ఎన్నో ప్రయాసల మధ్య బాధితులకు స్థలాలను మార్కెట్ ప్రకారం క్రమబద్ధీకరించాలని అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తుచేశారు. ఈ క్రమబద్ధీకరణ జీవోను సవాలు చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. సదరు లేఅవుట్లలో పట్టాభూములు, ఎక్స్‌సర్వీస్‌మెన్లు, స్వాతంత్ర సమరయోధుల భూములను మినహాయించి, అసైన్డ్, ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా నేటికి అమలుకు నోచుకోవడం లేదని బాధితులు వాపోయారు. రెవెన్యూ యంత్రాంతం సహాయ సహకారాలతోనే ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాగా నేడు ప్లాట్లు నిజమైన యజమానులకు దక్కకుండా కుట్రలు సైతం వారే చేస్తున్నారని ఆరోపించారు. డీఆర్వో కస్టడీలో ఉన్న సొసైటీ భూమి అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. ఇప్పటికే 20ఎకరాల భూమి అన్యాక్రాంతం అయిందన్నారు. కోర్టు విచారణలో ఉన్న సర్వే నంబర్ 1000లో అటవీశాఖ చెట్లు నాటే కార్యక్రమానికి రెవెన్యూ అధికారులు ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. ప్లాట్ల స్థలాలలో చెట్లు నాటితే సహించేది లేదన్నారు. మరోవైపు 990, 997 సర్వే నంబర్లలో నోటరీల ద్వారా సొసైటీ భూములు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.

టైర్ కోసం వెళ్లి.. చెరువులో మునిగి బాలుడి మృతి


బాలుడి మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువస్తున్న దృశ్యం

ఝరాసంగం, జూలై 11 : మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామంలో గురువారం చెరువులో మునిగి బాలుడు మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన విష్ణువర్ధన్(8), మరో బాలుడు ఇద్దరు గ్రామ సమీపంలోని చెరువు కట్టపై టైరు ఆట ఆడుతూ వెళ్తున్నారు. విష్ణువర్ధన్ టైరు నేరుగా చెరువులోకి వెళ్లగా, బాలుడు టైరు కోసం చెరువు నీటిలోకి దిగాడు. మరో బాలుడు అరుపులు, కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే నీటిలో మునిగి మృతిచెందిన విష్ణువర్ధన్‌ను స్థానికులు ఒడ్డుపైకి చేర్చారు. విష్ణువర్ధన్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు రవి, పుష్పలత, కుటుంబీకులు చెరువుకట్ట వద్దకు చేరి బాలుడి మృతదేహాన్ని చూసి విలపించారు.

ఐఐటీహెచ్‌లో 15న ఇన్నోవేషన్ డే

కంది, జూలై 11: కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్‌లో ఈ నెల 15న ఇన్నోవేషన్‌డేను నిర్వహించనున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇన్నోవేషన్ డేలో దేశంలోని ప్రముఖ సంస్థలకు చెందిన స్టార్టప్‌లను ప్రదర్శించనున్నారు. ఈ ఈవెంట్‌లో పిచ్ సెషన్‌లు, ప్యానల్ చర్చలు, సాంకేతిక ఆవిష్కరణల ప్రదర్శనలు ఉంటాయి. పాల్గొనే వారు ఐటీఐసీ.ఐఐటీహెచ్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసువాలని ఐఐటీహెచ్ అధికారులు తెలిపారు.

అరుణాచలానికి ఆర్టీసీ లగ్జరీ బస్సు

● సంగారెడ్డి ఆర్టీసీ డీఎం ఉపేందర్

సంగారెడ్డి అర్బన్, జూలై 11 : ఆషాడమాసం సందర్భంగా అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడపాలని నిర్ణయించినట్టు సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న సాయంత్రం 6 గంటలకు సంగారెడ్డి కొత్త బస్టాండ్ నుంచి అరుణాచలానికి బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఒక్కో ప్రయాణికునికి ప్యాకేజీ కింద రూ.4100 చొప్పున చెల్లించాలని తెలిపారు. భక్తులు టీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9959226267, 7382831275 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు

● వడ్లు, బియ్యం నిల్వల పరిశీలన



రైస్‌మిల్లులోని వడ్ల నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పుల్‌కల్, జూలై 11 : చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులోని శ్రీసాయి వీరభద్ర రైస్‌మిల్లులో గురువారం పౌర సరఫరాల శాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. సిద్దిపేట డీఎస్‌వో తనూజ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు బియ్యం నిల్వలు, ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం నిల్వలు ఏమేరకు ఉన్నాయంటూ రైస్‌మిల్లు యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. కొండాపూర్, సదాశివపేట, సంగారెడ్డిలలోని గోదాముల్లో నిల్వ ఉంచిన మూడు సీజన్లకు సంబంధించిన వరి ధాన్యాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు నిల్వలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. వచ్చే సెప్టెంబరు 30వ తేదీ నాటికల్లా వందశాతం కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను పూర్తి చేయాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించే రైస్ మిల్లర్లపై కఠిన చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని సిద్దిపేట డీఎస్‌వో తనూజ తెలిపారు. నిర్దేశిత లక్ష్యం మేరకు బియ్యం అందజేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు ప్రభాకర్, చౌటకూర్ తహసీల్దార్ ఈశ్వరీరాణి, ఏఎస్‌ఐ వెంకటేశం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● 15 తులాల వెండి, అర తులం బంగారం అపహరణ



బీరువా పగలగొట్టి చిందరవందరగా పడేసిన వస్తువులు

కంది, జూలై 11 : కందిలో బుధవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా నివసించే జంగంగారి రాములు ఇంటికి తాళం వేసుకుని సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం రెండు రోజులుగా అక్కడే ఉన్నారు. బుధవారం రాత్రి ఆ ఇంటి తాళాలు పగలగొట్టి దొంగలు చొరబడ్డారు. బీరువా పగలగొట్టి అందులోంచి 15 తులాల వెండి, అరతులం బంగారం చోరీ చేశారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూసి ఇంటిలోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడం, బీరువా పగులగొట్టి సొత్తు ఎత్తుకెళ్లడం చూసి కంగుతిన్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు క్లూస్ టీంతో వెళ్లి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



కొక్కొండ నీరజ(ఫైల్)

చేర్యాల, జూలై 11 : కుటుంబ కలహాలతో మనోవేదనకు గురై ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొక్కొండ నీరజ (30)కు ఆమె భర్త, కుటుంబసభ్యుల మధ్య తగాదాలు తలెత్తాయి. ఈవిషయమై మనస్థాపానికి గురైన నీరజ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా, అదనపు కట్నం కోసం వేధించడంతో పాటు అక్రమ సంబంధం నెపంతో అత్తింటివారు చిత్రహింసలకు గురి చేయడంతోనే తమ కూతురు నీరజ ఆత్మహత్య చేసుకుందని నీరజ పుట్టింటి వారు ఆందోళన చేపట్టారు. పోలీసులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూడు రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లి..

బావిలో శవమై తేలాడు



బావిలో రమేష్ మృతదేహం

మునిపల్లి, జూలై 11 : మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి బావిలో శవమై తేలిన సంఘటన గురువారం మునిపల్లి మండలంలో వెలుగుచూసింది. ఎస్‌ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం గురుజువాడ గ్రామానికి చెందిన గడ్డం రమేష్(35)కు పదేళ్ల క్రితం మునిపల్లి మండలం బుదేరాకు చెందిన మమతతో వివాహం అయింది. కొన్నాళ్లుగా అత్తగారి ఇంటి వద్ద బుదేరాలోనే నివాసం ఉంటున్నారు. మూడు రోజుల క్రితం పనికి వెళ్తున్నానని చెప్పి రమేష్ ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా రమేష్ ఆచూకీ లభించలేదు. కాగా గురువారం బుదేరా గ్రామ శివారులోని ఓ బావిలో రమేష్ మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారంతో మునిపల్లి ఏఎస్‌ఐ ఏసయ్య సంఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించారు. రమేష్ భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపారు. అయితే రమేష్‌కు పదేళ్లయిన పిల్లలు లేకపోవడంతో మనోవేదనకు గురయ్యేవాడని, ఈ నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

చికిత్స పొందుతూ ఎలక్ట్రీషియన్ మృతి



యాదగిరి (ఫైల్)

చిన్నకోడూరు, జూలై 11 : బిల్డింగ్ స్లాబ్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాలైన ఎలక్ట్రీషియన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని కంచరి బజార్‌కు చెందిన బోనగిరి యాదగిరి(54) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటు ఉండేవాడు. యాదగిరి గత నెల 21న మధ్యాహ్న సమయంలో మండలంలోని చంద్లాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో విద్యుత్ పనులు చేయడానికి వెళ్లాడు. యాదగిరి స్లాబ్‌లో కరెంట్ పైపులైన్ వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీనితో తల వెనక, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. యాదగిరిని వెంటనే చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యాదగిరి బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా యాదగిరికి ముగ్గురు కూతురులు, ఓ కుమారుడు ఉన్నారు.



సదాశివపేట సంగమేశ్వర మందిరంలో..



జహీరాబాద్ మాణిక్‌ప్రభు మందిరంలో..



నాగల్‌గిద్ద మండలం దామర్‌గిద్దలో..

కరుణించు వరుణదేవా..

వానాకాలం సీజన్ నెల గడిచినా ఒక్క పెద్ద వర్షం కూడా పడలేదు. వేసుకున్న విత్తనం మొలకెత్త లేదు. మొలకెత్తిన చోట వాడిపోతున్నాయి. వరినాట్ల ఊసే లేదు. దీంతో, రైతన్నలు వరుణుడి కరుణ కోసం పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. నాగల్‌గిద్ద మండలంలో రైతులు భజనలు చేస్తూ పాదయాత్రగా వెళ్లి ఆలయాలను దర్శించుకున్నారు. సదాశివపేట పట్టణం సంగమేశ్వర మందిరంలో, జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు ఆలయంలో శివుడికి జలాభిషేకం చేశారు. గంగను భువిని పంపమని వేడుకున్నారు.

-నాగల్‌గిద్ద/సదాశివపేట/జహీరాబాద్

అధిక రాబడినిచ్చే పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి

● వ్యవసాయ అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం, జూలై 11 : ఉత్పత్తి ఖర్చు తగ్గించి, అధిక రాబడిని అందించే పంటలను పండించేలా రైతులను ప్రోత్సహించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేస్తూ రైతుల జీవన ప్రమాణాలను మెరుగు పరచాలన్నదే లక్ష్యంగా అవగాహన కల్పించాలని సూచించారు. కొల్చారం రైతు వేదికలో గురువారం ఆయిల్‌పామ్ సాగు విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొనగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గిస్తూ ఆదాయం పెంపొందించే మార్గాలపై దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ప్రతీ వ్యవసాయ విస్తీర్ణాధికారి రైతు వేదికలలో నిత్యం అందుబాటులో ఉండాలని, తన క్లస్టర్ పరిధిలోని గ్రామాలలో పర్యటించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు అందించాలన్నారు. ప్రతీ రైతు వేదిక క్లస్టర్ పరిధిలో 20 మంది రైతులతో సేంద్రియ సాగు విధానం చేపట్టాలన్నారు. బ్యాంకులో రుణాలు పొందలేని రైతుల వివరాలను సేకరించి వారికి సంబంధిత బ్యాంకు అధికారులతో మాట్లాడి రుణాలు మంజూరయ్యే విధంగా రైతులకు తోడ్పాటు అందించాలని తెలిపారు. ఉత్తమ పద్ధతులు పాటిస్తున్న రైతులను ఎంపిక చేసి మిగతా రైతులు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఎప్పటికప్పుడు మండల వ్యవసాయ అధికారులు, సహాయ సంచాలకులు తమ పరిధిలోని మండలాలు, డివిజన్లలో ఫర్టిలైజర్ దుకాణాలను విస్తృతంగా తనిఖీ నిర్వహించాలన్నారు. ఎరువుల కొరత లేకుండా చూడాలని, సరిపడా ఎరువులను ప్రాథమిక సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రైవేటు దుకాణాల ద్వారా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి నర్సయ్య, రామాయంపేట, నర్సాపూర్, కౌడిపల్లి ఏడీలు వసంత సుగుణ, సంధ్య, పుణ్యవతి, ఆయిల్‌పామ్ సాగు రాష్ట్ర ప్రత్యేక అడ్వైజర్ శ్రీరంగనాయకులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూంను పరిశీలన

మెదక్ అర్బన్, జూలై 11 : క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం మెదక్ స్టేడియంలోని స్ట్రాంగ్‌రూంను కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్టర్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీసీటీవీల పర్యవేక్షణ, సెక్యూరిటీ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు సంబంధించి కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లను భద్రపరచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విధులను బాధ్యతతో నిర్వహించాలి

మెదక్ జిల్లా పరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది పనితీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికను పరిశీలించారు. అంకితభావంతో విధులు నిర్వహించాలని, వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్‌లో భాగస్వాములవ్వండి

● సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, జూలై 11 : సొసైటీ ఫర్ సంగారెడ్డి కౌన్సిల్‌లో ఇంజనీరింగ్, మెడికల్ విద్యా సంస్థలతో పాటు వివిధ రంగాలు భాగస్వామ్యం కావాలని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళా ఉద్యోగుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఈ సొసైటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యా సంస్థలు ఎలాంటి సమస్యలున్నా ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇస్తే సమస్య జఠిలం కాకుండా చూస్తామన్నారు. గంజాయి, డ్రగ్ వంటి మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిందని, విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలన్నారు. పరిశ్రమల, విద్యాసంస్థల బస్ డ్రైవర్లు విధుల్లోకి వెళ్లే ముందు తప్పనిసరిగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావు, ఎస్ఎస్‌సి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రంజిత్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శిక్షణతో మానసిక, శారీరక ధృడత్వం

పోలీసు శిక్షణ మానసికంగా, శారీరకంగా ధృడంగా చేస్తుందని, సర్వీసు మొత్తం ఆరోగ్యంగా ఉండటానికి దోహద పడుతుందని ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. సంగారెడ్డి మండలం చిద్రుప్పలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా రోజువారీ విధుల్లో ఎదురయ్యే సమస్యలను ఏ విధంగా అధిగమించాలి, అత్యవసర, విపత్కర సమయాల్లో సైతం ఎలా నిలబడాలో, ధైర్య సాహసాలను నింపుతుందన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసి ఉత్తీర్ణత పొంది మీ జిల్లాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆకాంక్షించారు. అనంతరం శిక్షణా కానిస్టేబుళ్లతో కలిసి భోజనం చేశారు.

జనాభా నియంత్రణకు సహకరించాలి

● సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్, జూలై 17 : జనాభా నియంత్రణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జడ్పీ ఆఫీస్ నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశ జనాభా గణనీయంగా పెరుగుగున్నదని, దీంతో మౌలిక వసతులు కొరవడి ప్రజాజీవనం స్తంభించిపోతున్నదన్నారు. విద్య, వైద్యం ఉపాధి, ఆహారం, జీవనం తదితర అవసరాలకు పోటీ పెరిగి సమాజంలో అసమానతలు ఏర్పడుతాయన్నారు. ఇది భవిష్యత్తు తరాలకు ప్రమాదమన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ మాట్లాడారు. కాగా కుటుంబనియంత్రణలో సేవలందించిన డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, కుటుంబ నియంత్రణ పాటించిన లబ్ధిదారులకు అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డా.సంగారెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ మెస్‌ల నిర్వహణకు తర్వలో టెండర్లు

● ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్న అధికారులు



మెస్‌ను పరిశీలిస్తున్న అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు

పుల్‌కల్, జూలై 11: సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలోని వసతిగృహాల మెస్‌ల నిర్వహణకు తర్వలో టెండర్లు పిలవనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.నర్సింహా తెలిపారు. ఈ విషయమై జేఎన్టీయూహెచ్ ఉన్నతాధికారులకు సమాచారం అందించామని టెండర్ల తేదీలను ప్రకటించే అవకాశాలున్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడం లేదంటూ కొంతకాలంగా జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఈ నెల 9న చట్నీ పాత్రలో ఎలుక చక్కర్లు కొడుతున్న వీడియో వైరల్‌గా మారింది. దీంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ ఆదేశాల మేరకు అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, స్థానిక తహసీల్దార్ ఈశ్వరీరాణిలు బుధ, గురువారాల్లో వేర్వేరుగా ఆకస్మికంగా సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.నరసింహను వెంటబెట్టుకుని బాలురు, బాలికల వసతి గృహల్లోని భోజనశాలలకు వెళ్లి వండిన టిఫిన్, చట్నీ, అన్నం, కూరలను పరిశీలించారు. వంటగదులు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా ఆరా తీస్తూ స్వయంగా పరిశీలించారు. మరోపక్క ఇటీవల అపరిశుభ్రమైన వాతావరణంలో బాలుర మెస్ నిర్వహణ కొనసాగుతుందంటూ ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారుల బృందం తనిఖీల్లో బయటపడగా, ఆ మెస్‌ను సీజ్ చేశారు. కళాశాలలో విద్యనభ్యసిస్తున్న సుమారు 1,400 మంది బాల, బాలికలకు ప్రస్తుతం బాలికల వసతి గృహంలో వంటలు వండి అందజేస్తున్నారు. ఇక్కడి నుండే ఆహారాన్ని బాలుర వసతి గృహనికి సరఫరా చేస్తున్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

● మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ అర్బన్, జూలై 11 : ఐసీడీఎస్ ఉద్యోగులు సమయపాలన పాటించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. బాలల సదనాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న మెనూ పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలని, మెనూ విషయంలో రాజీపడకూడదన్నారు. ప్రభుత్వ ఆదేశాలను తప్పకుండా పాటించాలని సంబంధిత ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

ప్రభుత్వ బడి సమీపంలోనే ప్రైవేట్ పాఠశాల

● పట్టించుకోని విద్యా శాఖ అధికారులు



పెంకుటింట్లో ఏర్పాటు చేసిన స్కూల్

సిద్దిపేట క్రైం, జూలై 11 : బడిబాట కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక చేపట్టినప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్పష్టమవుతుంది. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ హైస్కూల్, ఉన్నాయి. ఈ ప్రభుత్వ బడులకు కూతవేటు దూరంలోనే ప్రైవేట్ పాఠశాల ఏర్పాటు చేశారు. దాంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఆ ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయులు తీసుకెళ్తున్నారు.

అనుమతి లేకుండా ఏర్పాటు ?

సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండానే ప్రైవేటు స్కూల్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాల నుంచి మూడు కిలోమీటర్ల వరకు ఎలాంటి ప్రైవేట్ స్కూల్ ఉండకూడదు. కానీ నిబంధనలను తుంగలో తొక్కి ప్రైవేట్ స్కూల్ ఏర్పాటు చేసి నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు విద్యా బోధన చేస్తున్నారు. ఈ ప్రైవేట్ స్కూలుకు అనుమతి లేకపోవడంతో గ్రామస్థులు విద్యాధికారులకు సమాచారం ఇవ్వడంతో స్కూల్ పెట్టకూడదని హెచ్చరించారు. దాంతో ఆ ప్రైవేట్ స్కూల్ యజమాన్యం ప్లే స్కూల్ ఏర్పాటు చేసింది. ప్లే స్కూల్లో నర్సరీ విద్యార్థులే ఉండాల్సి ఉంటుంది. కానీ, ఆ ప్రైవేట్ స్కూల్లో నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థుల అడ్మిషన్ తీసుకుంటున్నారు. ఈ విషయంలో విద్యా శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాల్లో ప్రీ విద్యా విధానం ఏర్పాటు చేసి నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులకు బోధన అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక చేసింది. ఈ ప్రైవేట్ ప్లే స్కూల్ ఏర్పాటుతో అటు అంగన్‌వాడీ కేంద్రానికి ఇటు ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు రాలేకపోతున్నారు.

పెంకుటిల్లులో స్కూల్

ప్రభుత్వం నియమ నిబంధన ప్రకారం ఒక ప్రైవేటు పాఠశాలకు అనుమతి కోసం బిల్డింగు, విశాలమైన తరగతి గదులతో పాటు, విద్యార్థులు ఆడుకోవడానికి మైదానం, ఫైర్ సెక్యూరిటీ ఉండాలి. కానీ పొన్నాల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ స్కూలు పెంకుటిల్లులో కొనసాగుతున్నది. విద్యా శాఖ అనుమతి లేకుండానే ఏర్పాటు చేసినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

అంగన్‌వాడీ సేవలను విస్తృత పరచాలి

● సంగారెడ్డి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి

జహీరాబాద్, జూలై 11 : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు, బాలింతలకు అందించే సేవలను విస్తృత పరచాలని సంగారెడ్డి జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి లలితకుమారి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రంజోల్ గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా తనఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, తదితరాలపై ఆరా తీశారు. అనంతరం పట్టణంలో రంజోల్ రైతువేదికలో పూర్వ ప్రాథమిక విద్య కార్యచరణ ప్రణాళికపై అంగన్‌వాడీ టీచర్లకు కొనసాగుతున్న శిక్షణకేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సునీతాబాయి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

మద్యంషాపు వద్దంటూ

మహిళల ఆందోళన



మదూరు పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

చిన్నశంకరంపేట, జూలై 11 : గతంలో సంగాయిపల్లి గ్రామ శివారులో ఉన్న మద్యం షాపును తొలగించి మడూరు గ్రామశివారులో ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు షాపులో మరమ్మతు పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న మడూరు గ్రామంలోని కొందరు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని నిరసన చేపట్టారు. మద్యంషాపును తొలగించాలని నినాదాలు చేశారు. పర్మిషన్ ఇచ్చిన ఎక్సైజ్ అధికారులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైన్స్ షాపు ఏర్పాటు చేస్తే తమ కుటుంబాలు వీధిన పడుతాయని, జీవితాలు నాశనమయ్యే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులకు వెళ్లకుండా మద్యం షాపు వద్ద ఉంటారని మహిళలు వాపోయారు. తాగుడుకు బానిసై ఇప్పటికే చాలా మంది ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయని, మద్యం షాపు రద్దు చేసేవరకు పోరాటం చేస్తామని అధికారులను హెచ్చరించారు.


మాట్లాడుతున్న చైర్మన్ పాండురంగారెడ్డి

రూ.14.50 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

పటాన్‌చెరు, జూలై 11: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.14.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు గురువారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కౌన్సిల్ ఆమోదం తెలిపింది. చైర్మన్ పాండురంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు అభివృద్ధి పనులు, సమస్యలపై కౌన్సిలర్లు చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో నిధుల లభ్యతను బట్టి అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా లింక్ రోడ్లు, కాలనీల్లో సీసీరోడ్లు, మంచినీటి సమస్యకు వందశాతం పరిష్కారం చూపించామని పేర్కొన్నారు. మున్సిపాలిటీని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా చేయడంలో కాలనీవాసుల సహకారం కావాలన్నారు. ఈ సందర్భంగా పలు వార్డుల కౌన్సిలర్లు తమ వార్డుల్లో విద్యుత్ సమస్యలు, రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, వైకుంఠధామాల ఏర్పాటుపై ప్రశ్నలను లేవనెత్తారు. కౌన్సిల్ దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను సత్వరం పరిష్కరిస్తామని కమిషనర్ జ్యోతిరెడ్డి హామీఇచ్చారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నందారంనర్సింహగౌడ్, డిప్యూటీ ఈఈ వెంకటరమణ పాల్గొన్నారు.

మహిళాశక్తితో ఆర్థికంగా బలోపేతం

ఝరాసంగం, జూలై 11: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో మహిళాశక్తి పేరుతో ఆదాయం సమకూరే కార్యక్రమాలను చేపడుతున్నదని డీపీఎం జయశ్రీరాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా మండలానికి 9 యూనిట్లు మంజూరయ్యాన్నారు. ఉత్సాహం ఉన్న ఎస్‌హెచ్‌జీలు, కామన్ ఇంట్రెస్టింగ్ గ్రూప్(సీఐజీ)లను గుర్తించి వెంటనే గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఏపీఎం బాలక్రిష్ణ, సీసీలు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి అమానుషం

- ఏఎస్ఐపై చర్యలు తీసుకోవాలి
- మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌గౌడ్
- విధులను బహిష్కరించి నిరసన తెలిపిన న్యాయవాదులు


మెదక్ అర్బన్: విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న మెదక్ న్యాయవాదులు


సంగారెడ్డిలోని జిల్లా కోర్టు ఎదుట రోడ్డుపై నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

మెదక్ అర్బన్/సంగారెడ్డి క్రైం/నారాయణఖేడ్/జహీరాబాద్/నర్సాపూర్, జూలై 11: సిద్దిపేటలో న్యాయవాదిపై పోలీసుల దాడి అమానుషమని, ఈ ఘటన మెదక్ బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం మెదక్ కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుభాష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవాదుల పాత్ర కీలకమైందని, ప్రజల హక్కులను కాపాడేందుకు ప్రతి నిత్యం ప్రజల పక్షాన పోరాడే న్యాయవాది పట్ల పోలీసుల వ్యవహరించిన తీరు సరియైందికాదన్నారు. ఓ కేసు విషయంలో తన క్లయింట్ బెయిల్ విషయమై వెళ్లిన జూనియర్ న్యాయవాది రవికుమార్‌పై టూటౌన్ ఏఎస్ఐ ఉమారెడ్డి అమర్యాదగా ప్రవర్తించి దాడి చేశాడని ఆరోపించారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి దాడి చేసిన ఏఎస్ఐని చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మణ్‌కుమార్, కరుణాకర్, సంతోష్‌రెడ్డి, శ్రీపతిరావు, శోభన్‌గౌడ్, పరశురాం గౌడ్, జీవన్‌రావు, మధు పాల్గొన్నారు. న్యాయవాదిపై దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి పట్టణంలోని జిల్లా కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాది రవికుమార్‌పై దాడిచేసిన సిద్దిపేట ఏఎస్ఐ ఉమ్మారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి గురువారం కోర్టు ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సారెడి, న్యాయవాదులు పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలో గల కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు మాణెన్న, ప్రధాన కార్యదర్శి గోపాలక్రిష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు. నర్సాపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నర్సాపూర్ కోర్టులో విధులు బహిష్కరించారు.

కుటుంబ నియంత్రణ పాటించండి

- మెదక్ జిల్లా వైద్యాధికారి డా.శ్రీరాం
- ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ వైద్యాధికారి డా.శ్రీరాం

మెదక్ కల్చరల్/గుమ్మడిదల/కంగ్టి/పెద్దశంకరంపేట, జూలై 11: కుటుంబ నియంత్రణ పాటిస్తే.. ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చునని మెదక్ జిల్లా వైద్యాధికారి డా.శ్రీరాం అన్నారు. గురువారం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులో గర్భం దాలిస్తే ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టి.. చదువు కొనసాగలేని పరిస్థితులు ఎదురవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయనిర్మల, నర్సాపూర్ డాక్టర్ అనిలా, మెదక్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శివదయాల్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గుమ్మడిదల మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర హెచ్‌ఈలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. మండల కేంద్రమైన కంగ్టిలో గురువారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నాగమణి, నారాయణరెడ్డి, విజయలక్ష్మి, సంగీత, లక్ష్మణ్ పాల్గొన్నారు. పెద్దశంకరంపేటలో పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది యాదయ్య, వెంకటేశం, రమాదేవి, సంతోష, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నంబరు ప్లేట్లు లేని వాహనాలు సీజ్


తూప్రాన్ పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

తూప్రాన్, జూలై 11: నంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలపై పోలీసులు కొరడా ఝులిపించారు. తూప్రాన్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద పాత జాతీయ రహదారిపై తూప్రాన్ ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో గురువారం సిబ్బంది వాహనాలు తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో నంబరు ప్లేట్లు లేకుండా వినియోగిస్తున్న 8 వాహనాలు పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ శివానందం వివరించారు. నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివానందం హెచ్చరించారు.

వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లు చోరీ

కౌడిపల్లి, జూలై 11: వ్యవసాయ మోటార్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి కేబుల్ వైర్లను చోరీ చేశారు. మండల కేంద్రానికి చెందిన పుండరీకం గౌడ్, చాకలి నాగరాజు, చంద్రం శ్రీనివాస్‌గౌడ్, కొత్తగొండం శ్రీశైలంలకు చెందిన కేబుల్ వైర్లను దొంగిలించారు. అలాగే మహ్మద్‌నగర్ శివారులోని గురువారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన పట్లోరి శ్రీనివాస్‌రావుకు చెందిన వ్యవసాయ బోరు కేబుల్, గ్రామపంచాయతీ మోటార్ కేబుల్, కుంటిగొల్ల నర్సింహులు, మధుసూదన్‌రెడ్డికి చెందిన బోర్ల వద్ద కూడా దుండగులు కేబుల్ వైర్లను దొంగిలించారు. ఈ విషయమై బాధితులు ఎస్ఐ రంజిత్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శాలిపేటలో వ్యక్తి అదృశ్యం


భిక్షపతి (ఫైల్)

చిన్నశంకరంపేట, జూలై 11: వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని శాలిపేట గ్రామంలో గురువారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బండారు భిక్షపతి ఈనెల 7న పొలం వద్దకెళ్లి వస్తానని భార్యకు చెప్పి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయమై కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

- 10 మంది అరెస్ట్, రూ.14 వేల నగదు స్వాధీనం

వెల్దుర్తి, జూలై 11: మండల పరిధిలోని యశ్వంతరావుపేట గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడులు చేశారు. 10 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.14,250 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్దుర్తి ఎస్ఐ నవతాగౌడ్ తెలిపారు. మండల పరిధిలోని ఏ గ్రామంలోనైనా పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలన్నారు.

రక్తదాన శిబిరం

జహీరాబాద్, జూలై 11: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను గురువారం జహీరాబాద్ పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని మాట్లాడారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యువ నాయకులు రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో జహీరారాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్‌జగన్, బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ ధర్నా

సదాశివపేట, జూలై 11: పట్టణంలో సర్వే 260లో దశాబ్దాల కాలంగా పూరి గుడిసెలు వేసుకుని నివాసముంటున్న నిరుపేదలకు పొజిషన్ ఇళ్ల స్థల పట్ట సర్టిఫికేట్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు ఎం.తాజుద్దీన్, షఫీ డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ సరస్వతీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద మాట్లాడుతూ పట్టణంలోని సర్వే నెంబర్ 260లో పదేళ్లకు పైగా పూరి గుడిసెలు వేసుకుని కొంతమంది నిరుపేద కుటుంబాలు నివసిస్తున్నాయని, వారికి వెంటనే ఇళ్లస్థలాలు అందజేయాలని కోరారు.

లింకు రోడ్డు ఆక్రమణను అడ్డుకున్న అధికారులు


మంగంపేట-ఊట్ల లింకు రోడ్డు ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

జిన్నారం, జూలై 11: మంగంపేట గ్రామ శివారులో లింకు రోడ్డును ఆక్రమించే ప్రయత్నాలను స్థానికులు, అధికారులు అడ్డుకున్నారు. గురువారం మంగంపేట గ్రామ శివారు 55 సర్వే నెంబరులో మంగంపేట-ఊట్ల గ్రామాల లింకు రోడ్డును ఓ పరిశ్రమ ఆధ్వర్యంలో ఆక్రమించే ప్రయత్నం చేశారు. స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వగా.. ఎంపీవో సంతోష్ అక్కడికి చేరుకొని పనులు అడ్డుకున్నారు. కాగా ఇటీవలే పరిశ్రమ ఆక్రమణలపై స్థానికులు ఆర్డీవో, కలెక్టరేట్ కార్యాలయాలలో ఫిర్యాదులు చేసినట్లు స్థానికులు తెలిపారు.

జాతీయ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర చైర్మన్‌గా అబ్దుల్‌రహీం

నారాయణఖేడ్, జూలై 11: జాతీయ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర చైర్మన్‌గా నాగల్‌గిద్ద మండలం ఏస్గీ గ్రామానికి చెందిన అబ్దుల్‌రహీం నియమిస్తూ సంస్థ జాతీయ అధ్యక్షుడు మెహతాబ్‌రాయ్ ఉత్తర్వులు జారీచేశారు. గురువారం ఆ ఉత్తర్వులను సంస్థ జాతీయ ఇన్‌చార్జి నరేందర్ రహీంకు అందజేశారు. 15 ఏళ్లుగా రాజ్యాంగ పరిరక్షణ, అంబేడ్కర్, పూలే ఆశయాలు, సిద్ధాంతాలు, చట్టాలపై అవగాహన, మానవ హక్కుల పరిరక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

చిన్నశంకరంపేట, జూలై 11: బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండలంలోని చందాపూర్, రుద్రారం గ్రామాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం చందాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పోతరాజు వెంకటమ్మ కొన్నినెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. కాగా పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.

'చేగుంటలో కొత్తగా మార్వాడీలు షాపులు పెట్టొద్దు'

చేగుంట, జూలై 11: చేగుంట మండల కేంద్రంలో మార్వాడీలు కొత్తగా షాపులు ఏర్పాటు చేయొద్దని స్థానిక వ్యాపారస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం, పీఎస్‌లో వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వస్త్ర దుకాణ అసోసియేషన్ అధ్యక్షుడు చాముండేశ్వరీరమేష్‌గుప్తా మాట్లాడుతూ చేగుంటలో గతం వచ్చి స్థిరపడ్డ మార్వాడీలు మాత్రమే వ్యాపారం చేసుకోవాలని, కొత్తగా వచ్చిన వారికి వ్యాపారం చేసే ఆస్కారం లేదని హెచ్చరించారు. వారి వల్ల స్థానిక చిరు వ్యాపారాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు.

రేగోడులో ఘనంగా బోనాలు


అల్లాదుర్గం: రెడ్డిపల్లిలో కట్టమైసమ్మకు బోనాలతో వెళ్తున్న మహిళలు

రేగోడు/అల్లాదుర్గం, జూలై 11: ఆషాఢమాసం పురస్కరించుకొని మండల కేంద్రమైన రేగోడు గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ జరిపారు. పోతురాజుల నృత్యాలు, బ్యాండ్ మేళాలతో పోలేరమ్మదేవి ఆలయానికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు రాధాకిషన్, ఉపాధ్యక్షుడు మల్లన్న పాల్గొన్నారు. అలాగే అల్లాదుర్గం మండలం రెడ్డిపల్లి గ్రామంలోని కట్టమైసమ్మకు గురువారం ఘనంగా బోనాలు సమర్పించారు.

'మొహరం పండుగ శాంతియుతంగా జరుపుకోవాలి'

మనోహరాబాద్, జూలై 11: మొహరం పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ సుభాష్‌గౌడ్ సూచించారు. గురువారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని తెలిపారు.

సమాచారం

మంత్రులకు ఏజీపీ కృతజ్ఞతలు

జహీరాబాద్: జహీరాబాద్ కోర్టు ఏజీపీగా నియామకమైన నతానియేల్ గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

గుమ్మడిదల: గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ఫ్లిప్‌కార్ట్ వైద్య సంస్థ ఆధ్వర్యంలో గురువారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీడీవో ఉమాదేవి ప్రారంభించగా.. వైద్యులు పరీక్షలు చేశారు.

'విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి'

నారాయణఖేడ్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి తెంకటికుమార్ డిమాండ్ చేశారు. ఖేడ్‌లో గురువారం నిర్వహించిన సంఘం డివిజన్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

'కళాకారులు కష్టజీవుల పక్షాన నిలబడి పని చేయాలి'

కొండాపూర్: కళాకారులు కష్టజీవుల పక్షాన నిలబడి పని చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా సహాయ కార్యదర్శి వి.యేసు అన్నారు. కొండాపూర్ మండలం గంగారంలో ప్రజానాట్య మండలి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

వట్‌పల్లి ఎస్ఐగా సంగమేశ్వర్

వట్‌పల్లి: వట్‌పల్లి ఎస్ఐగా కే.సంగమేశ్వర్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కోటేశ్వరరావు సంగారెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు. సంగారెడ్డి ఎస్‌బీ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న సంగమేశ్వర్‌ను వట్‌పల్లికి బదిలీ చేశారు.

మునిపల్లి ఎస్ఐగా రాజేష్‌నాయక్

మునిపల్లి: మునిపల్లి ఎస్ఐగా రాజేష్‌నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సురేష్ వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలానికి బదిలీపై వెళ్లారు.

నగదురహిత వైద్య పథకం అమలు చేయండి

- టీఎస్‌జీఆర్ఈ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి


అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

సంగారెడ్డి రూరల్, జూలై 11: నగదురహిత వైద్యమందించే ఈహెచ్ఎస్(ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్) సక్రమంగా అమలు కావడం లేదని, ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఆర్ఈ) జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలోని చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు పెన్షనర్లు ర్యాలీగా వెళ్లి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యమందించాలనేదే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ప్రస్తుతం పెన్షనర్లు తమ పదవీ విరమణ సందర్భంలో కమ్యూటేషన్ ద్వారా పొందిన మొత్తాన్ని 15 ఏళ్లలో రికవరీ చేయబడుతున్నదని, కానీ కేరళ, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో 12 ఏళ్లకు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీచేసి అమలు చేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో కూడా రికవరీ కాలాన్ని 12 ఏళ్లకు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పెన్షనర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్ ఉన్నారు.

టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డికి సన్మానం


నిర్మలాజగ్గారెడ్డిని సన్మానిస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ కంది కృష్ణగుప్తా, కాంగ్రెస్ జిల్లా నాయకులు

సదాశివపేట, జూలై 11: టీజీఐఐసీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన తూర్పు నిర్మలాజగ్గారెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఇండస్ట్రియల్ భవన్‌లో సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణగుప్తా ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంజీర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, ఎంఆర్ఎఫ్ పరిశ్రమ కార్మిక పోరాట సమితి అధ్యక్షుడు కొత్తగొల్ల చంద్రశేఖర్, నాయకులు కృష్ణ, కుమారస్వామి పాల్గొన్నారు.

జహీరాబాద్ అభివృద్ధికి నిధులివ్వాలని సీఎంకు వినతి

జహీరాబాద్, జూలై 11: జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించాలని మాజీ మంత్రి డా.చంద్రశేఖర్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లో సీఎంకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి పెద్దమొత్తంలో నిధులను కేటాయించాలని సీఎంను కోరామని చెప్పారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు హన్మంతరావుపాటిల్, మక్సూద్, రామలింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింహులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి


దీక్షలో మాట్లాడుతున్న గోదావరిఅంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూలై 11: రైతులకిచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి ఆరోపించారు. సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం రైతు సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోగా.. రైతులకు ఇస్తామన్న రెండు లక్షల రుణమాఫీని కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ రైతులను మోసం చేస్తున్నదన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఎటువంటి ఆంక్షలు లేకుండా రెండు లక్షల రుణమాఫీని వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన దీక్షలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు

నారాయణఖేడ్/పెద్దశంకరంపేట/కల్హేర్/ఝరాసంగం/అల్లాదుర్గం జూలై 11: మండల పరిధిలోని సత్యగామ ఎంపీపీఎస్ పాఠశాల హెచ్‌ఎంగా 14 ఏళ్ల సేవలందించి, మనూరు మండలం బోరంచకు బదిలీ అయిన మైత్రి యశ్వంత్‌కు ఆత్మీయ వీడ్కోలు పలికారు. సత్యగామ మాజీ సర్పంచ్ వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ శోభాఅశోక్‌రెడ్డి, బీజేపీ నాయకులు సన్మానించారు. బదిలీపై వెళ్తున్న పెద్దశంకరంపేట మండల పరిధిలోని బద్దారం ప్రాథమిక పాఠశాలకు చెందిన నలుగురు ఉపాధ్యాయులు చంద్రప్రకాష్, ఆనంద్, నవనీత్, శ్వేతలను సన్మానించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విఠల్, రాములు, ఉపాధ్యాయులు ప్రసన్న, గోపి పాల్గొన్నారు. కల్హేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీ అయిన ఉపాధ్యాయులు మోహన్, రాజయ్య, మురళీగౌడ్, మచ్చేందర్‌ను గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఝరాసంగం మండల పరిధిలోని సంగం(కే) ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు శకుంతల, స్వర్ణజ్యోతి, జయమ్మ బదిలీపై వెళ్లడంతో గ్రామస్థులు, విద్యార్థులు గురువారం సన్మానించారు. అల్లాదుర్గం మండలంలోని చేవెళ్ల ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సునీత, గురుచరణం, అశోక్‌లను ప్రధానోపాధ్యాయుడు బాలకిష్టయ్య, ఉపాధ్యాయులు సన్మానించారు.

ప్రభుత్వ ప్లీడర్‌గా వైద్యనాథ్ వీరప్పపాటిల్


వైద్యనాథ్

నారాయణఖేడ్/సంగారెడ్డి క్రైం, జూలై 11: సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ప్లీడర్‌గా నారాయణఖేడ్ మండలం హంగర్గ.కె గ్రామానికి చెందిన వైద్యనాథ్ వీరప్పపాటిల్ నియామకమయ్యారు. వైద్యనాథ్ కర్ణాటకలో న్యాయవాద పట్టా అందుకున్న అనంతరం సంగారెడ్డిలో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. 2009లో జిల్లా ఏడవ అదనపు సెషన్స్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. అనంతరం 2001లో ఎంపీటీసీగా, 2008 నుంచి 2010 వరకు నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ప్లీడర్‌గా నియామకమైన వైద్యనాథ్ వీరప్ప పాటిల్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యేను సన్మానించారు. సంగారెడ్డి జిల్లా కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా నియామకమైన సీనియర్ న్యాయవాది వైద్యనాథ్ పాటిల్‌ను సంగారెడ్డిలో గురువారం న్యాయవాదులు సన్మానించారు.

కల్హేర్‌లో పౌర సరఫరాల అధికారుల తనిఖీ

కల్హేర్, జూలై 11: సన్న బియ్యం బస్తాల లోడుతో వెళ్తున్న లారీలో రేషన్ బియ్యం రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు, పౌర సరఫరాల అధికారులు గురువారం తనిఖీ చేశారు. మిర్యాలగూడలోని ఓ రైస్ మిల్లు నుంచి మహారాష్ట్రలోని నాందెడ్ జిల్లా ముఖెడ్‌కు 1,600 సన్న బియ్యం బస్తాలతో 161వ జాతీయ రహదారిపై వెళ్తున్న లారీని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ ఆదేశాల మేరకు ఖేడ్ పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మహేష్ కల్హేర్‌కు చేరుకుని ఏఎస్ఐ అంజయ్య సమక్షంలో లారీలోని బియ్యం బస్తాలను తనిఖీ చేశారు. లారీలోని అన్ని సోనా మసూరి సన్న బియ్యం బస్తాలే ఉన్నట్లు తనిఖీలో తేలింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లారీని వదిలిపెట్టారు.

సద్దుమణిగిన రహదారి సమస్య

- అదనపు కలెక్టర్ చొరవతో పరిష్కారం


పోస్టాఫీస్ క్వార్టర్స్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 11: ఎన్నోరోజులుగా ఇరుశాఖల మధ్య గొడవలకు దారితీస్తున్న రహదారి సమస్య ఎట్టకేలకు సద్దుమణిగింది. పట్టణ నడిఒడ్డున గల చిల్డ్రన్స్ పార్కు వెనకభాగంలో పోస్టాఫీస్ క్వార్టర్స్ నిర్మించారు. అప్పట్లోనే వీరు రాకపోకలు సాగించేందుకు ఇరువైపులా గేట్లు ఏర్పాటు చేసుకున్నారు. కానీ మున్సిపల్ ఆమోదించిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం అక్కడ గేట్లు ఏర్పాటు చేయకూడదనేది మున్సిపల్ అధికారుల వాదన. కొన్నేళ్లుగా అది అలా సాగిపోగా.. కొంత కాలంగా ప్రజలు రాకపోకలు సాగించేందుకు గేట్లు తెరిచి ఉంచాలని స్థానిక రాంనగర్, వాసవినగర్, వీరహనుమాన్ కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ విషయం కౌన్సిలర్, చైర్మన్ల దృష్టికి తీసుకెళ్లగా ఆరునెలల నుంచి గేట్లు తెరిపించారు. కానీ మళ్లీ తిరిగి పోస్టాఫీస్ సిబ్బంది ఈ దారి మాదంటూ బోర్డులు ఏర్పాటు చేసి గేట్లకు తాళాలు వేశారు. స్థానిక నేతలు మున్సిపల్ సిబ్బందితో కలిసి గేట్లు కూలగొట్టించారు. ఈ విషయాన్ని స్థానిక సంస్థలు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు దృష్టికి వెళ్లగా గురువారం ఆయన రహదారి వద్దకు చేరుకున్నారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, మాస్టర్‌ప్లాన్‌లో రోడ్డు ఉంది గనుక రహదారిలో రాకపోకలు యథాతథంగా కొనసాగించాలని ఆదేశించారు. ఇంతటితో సమస్య సద్దుమణిగినట్లైంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కమిషనర్ జానకీరాంసాగర్, నాయకులు మేడి మధుసూదన్‌రావు, దుర్గాప్రసాద్, పోస్టాఫీస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


ఎస్టీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న విజయ

శివ్వంపేట, జూలై 11: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయ వార్డెన్ యాదయ్యను ఆదేశించారు. మండల కేంద్రమైన శివ్వంపేటలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రహరీ పనులు నిలిచిపోవడంతో వివాదాస్పద భూమిని, రికార్డులను, హాస్టల్ పరిసరాలను వంటగదిని స్టోర్ రూమ్‌ను పరిశీలించి వసతులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ: రాధాక్రిష్ణ

కొల్చారం/చిన్నశంకరంపేట, జూలై 11: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని మండల ప్రత్యేకాధికారి, డీఈవో రాధాక్రిష్ణ అన్నారు. కొల్చారం మండల పరిధిలోని ఏటిగడ్డ మాందాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన వనమహోత్సవంలో పాల్గొన్న ఆయన మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, ఎంఈవో నీలకంఠం, తాజామాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలంతో పాటు పలు గ్రామాల్లోని ఎవెన్యూ ప్లాంటేషన్‌లోని మొక్కలను ఎంపీడీవో దామోదర్ పరిశీలించారు.